

# గుర్రం ఓడిపోయింది

సియస్.రావు

మన దేశంలో ఒక మహానగరం. మహారణ్యంలాంటి మహానగరం. ఆది నాగరికులు నివసించే నగరం. నాగరికతకు ఆటపట్టు ఆ నగరం. నాగరికత నడిబొడ్డులోంచి అనాగరికత ధ్వజమెత్తింది.

నాగరికత జలతారు పరదామాటున పొట్టకూటికోసం నగ్న నృత్యాలు-మనిషిని రిక్షాలో కూర్చోబెట్టి యంత్రంలా కాళ్ళు కదిలిస్తూ రిక్షాతొక్కే రిక్షావాలా -మాసిన అద్దాల లంగా కట్టుకొని మూటలుమోసే లంబాడీలక్కి - పాష్ హోటల్ నీడలో ఎంగిలాకులు ఎప్పుడు పడతాయా బయటకని కుక్కలతో సమంగా కాచుకొని కూర్చున్న ఆకలి కళేబరాలు - పేవ్‌మెంటే నివాసంగా బతికే నిరాశ్రయులు-పబ్లిక్ గార్డెన్స్ చెట్ల నీడలో మసకచీకట్లో కడుపు నింపుకోవడంకోసం గాజుల గలగలలు-'వ్యభిచారం మా జన్మహక్కు' అంటూ 'మీరు మరో మార్గం చూపించలేనప్పుడు మమ్మల్ని యిలాగైనా బతకనివ్వండి, మా బతుకుల్ని జలగలబారినుండి కాపాడండి' అని ప్రభుత్వానికి వినతిపత్రాలను సమర్పించుకొంటూన్న పతితలు-వీళ్లంతా మెరిసే నాగరికతమీద పోసిన స్ఫోటకం పొక్కులు.

తను పేదవాడే అయినా పేదరికాన్ని పెనుభూతంలా చూస్తూ, నవనాగరికుడిలా అగుపించడంకోసం, ఎలాగోలా నాగరికులతో కలిసిపోవడంకోసం తన పేదరికాన్ని కొట్టొచ్చినట్టు చాటే చిరిగిన తెల్ల చొక్కామీద కాబూలీ అప్పుతో కుట్టించుకున్న కోటు కప్పుకొని, లేని చిరునవ్వు పెదవులమీదకు బలవంతగా తెచ్చిపెట్టుకొనే మధ్యతరగతి మనిషి యీ నగరంలో బతుకుతున్నాడు. నెల మొదటివారంలోనో, బల్లకింద పెట్టిన చేయి తడైనప్పుడో చట్టబద్ధంగా సాగుతోన్న లార్జిస్కేల్ జూదం-గుర్రప్పందాలకి వెడితే స్వయంగా వెడతాడు లేకపోతే ఆఫీసులోని మిత్రులతో కాంబినేషన్ టిక్కెట్లలో వాటా చేరతాడు; బార్‌కెళ్ళి గొంతు తడిచేసుకుంటాడు-కేబ్రె డాన్స్ చూసి కొన్నిగంటలు మేఘాల్లో విహరిస్తాడు-తనూ యీ నాగరికతకు వాటాదారుడేనని ఆత్మవంచన చేసుకుంటూ తృప్తిపడతాడు. పేవ్‌మెంటు పక్కన స్టేట్ లాటరీ టికెట్లు అగుపించినప్పుడు, 'కష్టపడి పైకి రావడం చాలా కష్టం-అదృష్టం వుంటే అడ్డదార్లు బోల్డు. అందులో యీ

లాటరీలు ఒకదారి. మొన్నీమధ్య ఏదో లాటరీలో పళ్లఅమ్ముకునే వాడికి లక్ష రూపాయలొచ్చాయ్' యిలాంటి ఆలోచనలు మెదడుని కుమ్మరపురుగుల్లా దొలిస్తే-తట్టుకోలేక ప్రతి లాటరీకి పది టికెట్లు తక్కువ కాకుండా కొంటూ వుంటాడు పాపం మన మధ్యతరగతి ఆశాజీవి.


యిలాంటి ఆశాజీవుల్లో ఒక ఆశాజీవి సుందర్రావు.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన మర్నాడు పుట్టాడు సుందర్రావు. అప్పటి నాయకుల ఉపన్యాసాలు విని పులకితుడైన సుందర్రావు నాన్నగారు, 'మా బాబు జన్మతహ స్వతంత్రభారత పౌరుడని' ముద్దాడాడు.

దేశ స్వాతంత్ర్యంతోబాటే సుందర్రావుకీ వయసు పెరిగింది. బానిస భారతంలోపుట్టి స్వతంత్ర భారత పౌరులైనవాళ్లు ఒక్కొక్కళ్లే పోతున్నారు- సుందర్రావు తండ్రీ పోయాడు. సుందర్రావు బి.ఎ. పాసయ్యాడు. పాతకాలపు తల్లి 'మా బాబు కలెక్టరౌతాడు. కాకపోతే తాసిల్దారు తప్పదు' అని లోలోనే మురిసిపోయింది. తండ్రి పోయినా సంసారం యింకా కాస్త పచ్చగానేవుంది. అందుకే ఎం.ఎ. కూడా చదివాడు సుందర్రావు. గోల్డుమెడలిచ్చారు.

అది యింట్లో దాచుకుని ఉద్యోగాన్వేషణకి బయలుదేరాడు. స్వాతంత్ర్యానికి వచ్చిన వయసుతోబాటు నిరుద్యోగానికీ మాంచి వయసొచ్చింది. కూర్చుని తినడంతో, ఉద్యోగప్రయత్నాలతో పచ్చని సంసారం 'పచ్చ'నికోల్పోయింది. గోల్డుమెడల్ రెండోకంటివాడికి తెలియకుండా తాకట్టుపెట్టి గట్టి ప్రయత్నం చేసాడు సుందర్రావు ఉద్యోగంకోసం.

'యీ ప్రాంతంలో ఉద్యోగాలున్నాయి కాని నీ కిక్కడ యివ్వడానికి




వీల్లేదు. మీ ప్రాంతంలో ఉద్యోగాలు ఖాళీలేవు,' అన్నారు కొన్ని ఆఫీసుల్లో.

'యీ కాలం గోల్డుమెడల్‌కి విలువ ఏముంది. ఇది కాపీల కాలం' అన్నారు కొందరు వెనకతరం మేధావులు.

చివరికి చిన్న వుద్యోగానికైనా సరే ననిసిద్ధపడ్డాడు సుందర్రావు. 'నీ క్వాలిఫికేషన్ మరీ ఎక్కువన్నారు' కొందరు.

కొడుకు పడుతోన్న అవస్థచూసి తల్లి స్వయంగా తమ్ముడిదగ్గర కెళ్ళింది. అతను సుందర్రావు మేనమామ, పేరు రాఘవరావు. అతను ఒక ప్రైవేట్ కంపెనీకి మేనేజింగ్ డైరెక్టరు. బానిస భారతదేశంలో పుట్టాడు, పెరిగాడు. తరవాత స్వతంత్రభారత పౌరుడయ్యాడు. అయినా అతనివన్నీ ఆ పాత అలవాట్లే. మనసులో 'ఎంత బానిసబతుకనుకున్నా ఆ వెనకటి రోజులే బాగున్నాయ్' అని అనుకుంటాడు. కాని పైకెన్నడూ అనడు, కాలాన్నిబట్టి కలరు మార్చుకొని బతకడం తెలిసిన పెద్ద మనిషి.

అక్క కోరిక ప్రకారం 'ఏదో ఉద్యోగం యిస్తే జాగర్తగా చేస్తావా?' అన్నాడు మేనల్లుడ్ని వుద్దేశించి. కొత్త పెళ్ళికొడుకులా తలవంచుకొని సిగ్గుపడ్డాడు, పెళ్ళి ఎప్పుడో అయిపోయిన సుందర్రావు.

'సరే, రేపు ఆఫీసుకు రా' అన్నాడు రాఘవరావు.

పెద్ద కంపెనీలో సుందర్రావు ఓ చిన్నగుమస్తాగా చేరాడు.

ఉద్యోగంలో చేరబోయే ముందు రోజునే అత్తయ్య 'నువ్వాయన మేనల్లుడివని ఆఫీసులో ఎవరికీ చెప్పకు బాబు. మేనల్లుడికి ఉద్యోగం యిచ్చాడని ఆయన్ని నలుగురూ ఆడిపోసుకుంటారు. అందుకే ఆయనసలు బంధువు లెవ్వరికి వుద్యోగా లిప్పించరు' అని సలహా యిచ్చింది.

ఉద్యోగంలో చేరిన రోజునే ఆర్డరు యిస్తూ 'ప్రైవేట్ కన్‌సరన్స్‌లో పదికాలాలపాటు వుద్యోగం నిలవాలంటే కష్టపడి పనిచెయ్యాలి' అని గీతోపదేశం చేసాడు మామయ్య సుందర్రావుకి.

సుందర్రావుకి విషయం అర్థమైంది. రెండుగదుల చిన్న పోర్షన్ తీసుకుని భార్యని పిల్లల్ని తీసుకొచ్చి కాపురం పెట్టుకున్నాడు. రోజులు గడుస్తున్నయ్. పేరుకి మామయ్యేగాని రాఘవరావుతో

ఆఫీసులోగాని, యింటి దగ్గరగాని చనువుగా మాట్లాడటానికి సుందర్రావుకి బెరుకు బెరుగ్గానే వుండేది. రాఘవరావు యింటికి తనూ పిల్లలూ ఎప్పుడేనా చుట్టపు చూపుగా వెళ్ళాలంటే-ఆ గేటు లోంచి బంగళాలోకి వెళ్ళేటప్పుడు స్వర్గ ద్వారంగుండా నడుస్తోన్న కీటకంలా ఫీలయ్యేవాడు సుందర్రావు. ఆ బంగళా లోకి అడుగుపెట్టాక ఆ సోఫామీద కూర్చోవాలన్నా, ఫ్రిజ్‌లో మంచినీళ్ళు తాగాలన్నా, డైనింగ్ టేబిల్ ముందు కూర్చోవాలన్నా, మావయ్యతో మాట్లాడాలన్నా అంతా ఎబ్బెట్టుగానే వుండేదతనికి. వాళ్ళంతా ముక్తసరిగానే వుండేవారు. ప్రతిక్షణం ఆఫీసులోనూ, యింట్లోనూ కూడా వారిద్దరి మధ్యా అంతస్థుల వ్యత్యాసం పున్నమినాటి సముద్రంలా కెరింతలు కొడుతూవుండేది అతని దృష్టిలో. ఆఖరికి ఆఫీసులో, రక్తసంబంధంవున్నా 'మావయ్యా!' అని నోరారా పిలవలేకపోయేవాడు సుందర్రావు రాఘవరావుని. సముద్రానికి ఆవలిగట్టు అనేది వుంటే అక్కడ మావయ్య - యీవలి వొడ్డున నేనూ' అనుకునేవాడు సుందర్రావు.



రోజులు గడుస్తున్నాయ్. సుందర్రావుకి మరో యిద్దరు పిల్లలు పుట్టారు. ఆఫీసులో కొన్ని బాధ్యతలు పెరిగాయి. బయట కొన్ని సంబంధాలు ఏర్పడ్డాయి. కొత్త స్నేహాలు కలిసాయి. సుందర్రావు కాస్త అందంగానే వుంటాడు. ఓ క్లాస్ మేట్ కలిసాడు. కాలేజీలో చదువుకునే రోజుల్లో కలిసి నాటకాలేసారిద్దరూ. ఆ స్నేహితుడు మూర్తి యిక్కడా నాటకాలేస్తూనే వున్నాడు. సుందర్రావు దిగాడు. ఏదో కాలక్షేపం అయిపోతోంది. మావయ్యగారింటికి రాకపోక లంతగా లేవు. ఎవరి గొడవ వారిది.

రోజులు దొర్లిపోతున్నా సుందర్రావు మనసులో ఏదో అసంతృప్తి. అతని మనస్సులో కొన్ని కనీస కోర్కెలు గూడుకట్టుకున్నాయ్. ఓ స్కూటరు, ఓ చిన్న సొంతయిల్లు-తనకీ భార్యకీ పిల్లలకీ మంచి బట్టలు, మోతాదుగా బేంక్ బేలన్సూ-యిలాంటి తీరని చిన్న చిన్న కోరికలు-అతను తనకంటె అట్టడుగున వున్నవాళ్ళతో పోల్చుకొని తృప్తిపడలేకపోయేవాడు. తనకంటే పైమెట్టుమీద వున్నవాళ్ళ వైపే దృష్టి అతనికి. మనసులోనే మధనపడుతూండేవాడు.

ఓసారి సుందర్రావు నటుడుగావున్న నాటకసమాజంవారు ఏదో వూరికి నాటకపోటీలలో పాల్గొనేందుకు బయలుదేరాల్సివచ్చింది. మూర్తి సుందర్రావుని 'వస్తావుకదా' అని అడిగాడు. 'తప్పకుండా' అన్నాడు సుందర్రావు. రిహార్సల్స్ పకడ్బందీగా చేసారు. తెల్లవారితే ప్రయాణం. టికెట్లు రిజర్వ్ చేసాడు మూర్తి, సమాజంలోని సభ్యులందరికీ. ఆరోజు ఉదయం సుందర్రావు మూర్తి దగ్గరకొచ్చాడు.

'నేను మీతో రాలేకపోతున్నాను. ఆఫీసులో ఒక్కరోజుకూడా శలవు యివ్వడానికి వీల్లేదన్నారు. ఆడిట్ వుందిట' అన్నాడు సుందర్రావు.

'సరేలే. ఉద్యోగం ముఖ్యంకాని, నాటకాలుకావు. నాటకాలు కూడుపెట్టేవి కావు. నేనే ఏదో వేరే ఏర్పాటుచేస్తాలే' అని మూర్తి, మిగిలిన సమాజసభ్యులు బయలుదేరి వెళ్ళిపోయారు.

నాటకపోటీలు విజయవంతంగా సాగిపోయాయి. మూర్తి మిగిలిన మిత్రులు తిరిగి వచ్చేశారు. ఓ రోజున మూర్తి సుందర్రావు యింటిముందునుంచి పోతుండగా సుందర్రావు భార్య మూర్తిని పిలిచింది.

మూర్తి లోపలికి వెళ్ళాడు.

'వారింకా అక్కడే వున్నారా అన్నయ్యగారూ' అంది మూర్తి భార్య.

'అదేవిటమ్మా. సుందర్రావు మాతో రాలేదే. మేం వచ్చేసి అప్పుడే మూడు రోజులయ్యింది' అన్నాడు మూర్తి.

'ఆయన మీతో నాటకపోటీలకి ఏదో వూరు వెడుతున్నానని చెప్పి బెడ్డింగ్ సర్దుకుని వెళ్ళారండీ' అంది ఆమె.

'మాతో రాలేదమ్మా మరి. ఎక్కడికెళ్లాడో ఏమో' అని చెప్పి మూర్తి వెళ్ళిపోయాడు.

సుందర్రావు భార్యకి కంగారు పుట్టింది. మరో రెండురోజులు అతి కష్టంమీద ఓపికపట్టింది. యింక వుండబట్టలేక రాఘవరావుగారికి ఫోన్‌చేసింది. రాఘరావు వెంటనే బయలుదేరి వచ్చాడు. అంత త్వరగా అతను వచ్చేవాడుకాదు. కాని వారంరోజులబట్టి సుందర్రావు ఆఫీసుకి రావడంలేదు. పైగా అతను ఆఫీస్ కేష్ డీల్ చేస్తున్నాడు. లక్షలు కాకపోయినా వేలు అతని చేతులిమీదుగా నడుస్తాయి. అందుకే అతను వెంటనే బయలుదేరి స్వయంగా సుందర్రావు యింటికి వచ్చాడు. ఆయన్ని చూసి సుందర్రావు భార్య విషయంచెప్పి వుండబట్టలేక బావురుమంది.


రాఘరావు ఆమెను ఓదార్చి, ధైర్యం చెప్పి-మూర్తికోసం కబురుచేసాడు. మూర్తి వచ్చాడు.

'మీతో మా సుందర్రావు రాలేదా నాటకపోటీలకి?' అధికార స్వరంతో అడిగాడు రాఘవరావు.

'లేదండీ,' అన్నాడు మూర్తి.

'పోలీసు రిపోర్టు యివ్వాల్సివస్తోంది. ఆ తరవాత మీరంతా యిరుక్కుంటారు' దబాయించాడు రాఘరావు.

మూర్తికి కోపం వచ్చింది. 'మేం అతన్ని అమ్మెయ్యలేదు. అతను మాతో రాలేదనిచెప్తే మీరెందుకు నమ్మటంలేదో నాకర్థంకావడంలేదు' అంటూ చర్రున కుర్చీలోంచి లేచాడు మూర్తి.




ఇంతలో 'పోస్ట్' అంటూ పోస్టుమేన్ ఒకవరు విసిరి చక్కాపోయాడు.

సుందర్రావు భార్య ఆత్రంగా కవరు అందుకుని చించింది. 'వారిదగ్గరనుంచే' అంది.

'ఏంరాసాడు?' రాఘవరావుఅడిగాడు.

వెళ్ళబోయిన మూర్తి ఆగిపోయాడు.

'ఎక్కడనుంచి?' అనడిగాడుమూర్తి.

'బెంగళూర్‌నుంచి రాసారు' అంది ఆమె.

'చదువమ్మా పైకి' రాఘవరావు ఆదేశించాడు.

ఆమె చదవడం మొదలుపెట్టింది.

'నేను బెంగళూరు వచ్చి వారంపైదాటింది. నా గురించి కంగారుపడవద్దు. బెంగపెట్టుకోవద్దు. నేను పైకిరావాలని, నిన్నూ పిల్లల్నీ సుఖపెట్టాలనిఆశపడ్డాను ఎంత శ్రమపడినా, శ్రమపడి పైకిరావడం కష్టమనిపించింది నాకు. అందుకే అడ్డదారులు వెతికాను. దాదాపు ఆఫీసు డబ్బు హైదరాబాద్‌లోనే అయిదారువేలు గుర్రప్పందాలలో పెట్టాను. అదృష్టం కలిసిరాలేదు. అది ఎప్పటికైనా బయట పడక తప్పదు. అందుకే మరో పదివేలు తీసుకొని బెంగుళూరు వచ్చాను. నా అదృష్టం యిక్కడ పరీక్షించుకున్నాను. నేను నమ్ముకున్న గుర్రాలు అన్నీ ఓడిపోయాయి. నేనూ ఓడిపోయాను. యీ ఉత్తరం నీ కందేసరికి నేను యీ లోకంలో వుండను. నేను ఆత్మహత్యకి సిద్ధమై యీ ఉత్తరం రాసాను. నేను తిరిగి నీదగ్గరకొస్తే నువ్వు ఓ దొంగ భార్యవి. పిల్లలు ఓ దొంగ పిల్లలు. నా చేతికి సంకెళ్లు. ఉద్యోగం పోవడం. అన్నీ సమస్యలే. నే మరణిస్తే మావయ్యకివేవీ పెద్ద మొత్తంకాదు. సర్దుకోగలడు. దిక్కులేని వాళ్ళని మీమీద జాలీ వుంటుంది. అందుకే యిలా చేస్తాను. ఇట్లు నీ సుందర్రావు. ఉత్తరం పూర్తిగా చదివి బొమ్మలా వుండిపోయింది ఆమె.

ఆత్మహత్య వ్యక్తిగతంగా సుందర్రావుకి పరిష్కారం కావచ్చు.

కాని ఆ చావు అతని కుటుంబానికి పరిష్కారం కాదు. అతనిలాంటి అనేక మంది కది పరిష్కారం కాదు.

అలాంటి మధ్యతరగతి వాళ్ళంతా పరిష్కారమార్గం ఏవిటో ఆలోచించుకోవాలి! వెతుక్కోవాలి!

———